## హనుమాన్ దేవాలయ ఈఓగా జయంతి



అమీర్‌పేట: అమీర్‌పేట శ్రీ హనుమాన్ దేవాలయ కార్యనిర్వహణ అధికారిగా కె.జయంతిని నియమించారు. బాధ్యతలు చేపట్టిన ఆమె గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దాతల సహకారంతో ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని అన్నారు. వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు. దసరా నవరాత్రి వేడుకల సందర్భంగా వచ్చే నెల 3వ తేదీ నుంచి ఆలయంలోని స్వామివార్లకు రోజుకో అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని చెప్పారు.

## 30 నుంచి పీడీఎస్‌యూ స్వర్ణోత్సవాల స్ఫూర్తి సభలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఈనెల 30 నుంచి నెల రోజుల పాటు జరిగే పీడీఎస్‌యూ స్వర్ణోత్సవాల స్ఫూర్తి సభలను జయప్రదం చేయాలని జాతీయ నాయకులు ఎస్.నాగేశ్వర్‌రావు పేర్కొన్నారు. గురువారం ఓయూ ఆర్ట్స్ కాలేజీలోని న్యూ సెమినార్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పీడీఎస్‌యూ ఆవిర్భావించి 50 ఏళ్ల సందర్భంగా సెప్టెంబరు 30 నుంచి అక్టోబరు 30వ తేదీ వరకు సభలు నిర్వహించనున్నట్లు చెప్పారు. జార్జిరెడ్డి, జంపాల, చంద్రశేఖర్, ప్రసాద్‌ల ఆధ్వర్యంలో ఏర్పడిన పీడీఎస్‌యూ 1974 అక్టోబరు 12, 13 తేదీలలో మొదటి మహాసభలు జరుపుకున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు సుమంత్, స్వాతి, రుక్మత్ పాషా, కోటేశ్వర్, ప్రశాంత్, సతీష్, వెంకటేష్, అంజి, నరేష్, ధనుష్, భువన, నవ్యశ్రీ, ప్రణీత, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## నారాయణ మృతికి సంతాపం

సనత్‌నగర్: సీనియర్ జర్నలిస్టు నారాయణ మరణం పట్ల మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ విచారం వ్యక్తం చేశారు. నారాయణ మృతి పట్ల సంతాపం ప్రకటించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఎమ్మెల్యే ప్రార్థించారు.

## అస్సాం సీఎంను కలిసిన డిప్యూటీ మేయర్



లాలాపేట: జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతాశోభన్ రెడ్డి నేతృత్వంలో ఇటీవల స్టడీ టూర్‌కు వెళ్లిన పలువురు జీహెచ్ఎంసీ కార్పొరేటర్ల బృందం గురువారం అస్సాం రాష్ట్రంలో పర్యటించారు. సచివాలయంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి డాక్టర్ హిమంత బిశ్వ శర్మను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు కొంత సేపు సీఎంతో సమావేశమయ్యారు. తెలంగాణ, అస్సాం రాష్ట్రాల మధ్య మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌లో పరస్పర సహకారాలపై చర్చించారు.

## సమస్యల పరిష్కారానికి కృషి

సనత్‌నగర్: బేగంపేట డివిజన్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. స్థానిక నేతలతో కలిసి ప్రజా సమస్యలపై గురువారం ఆయన బేగంపేట డివిజన్‌లోని ప్రకాష్‌నగర్, పాటిగడ్డ, వికార్‌నగర్, ప్రకాష్‌నగర్ ఎక్స్‌టెన్షన్ తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. స్థానికంగా పారిశుద్ధ్య సమస్య తీవ్రంగా ఉందని అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బందీగా చేయాలని కోరారు. అలాగే పొంగిపొర్లుతున్న డ్రైనేజీ వ్యవస్థలను ఆయన పరిశీలించి సమస్య తీవ్రతను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. పార్కుల నిర్వహణ, వీధిదీపాలు తదితర సమస్యలను పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం జరిగేలా చూస్తానన్నారు. బండి రమేష్ వెంట సీనియర్ నేతలు విశాల్ సూదం, హాసీటోచర్, రమేష్, రమాదేవి, నర్సింగ్‌రావు, జాన్, పార్వేజ్‌ఖాన్, అరుణ్‌గౌడ్, బాల తదితరులు ఉన్నారు.

## పరిసరాల శుభ్రతతో జీవన ప్రమాణాలు మెరుగు



గాంధీఆస్పత్రి : వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతో జీవన ప్రమాణాలు ఎంతో మెరుగుపడతాయని, రుగ్మతలు, వ్యాధులు దరిచేరవని మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ (డీఎంఈ) ప్రొఫెసర్ వాణి అన్నారు. నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్‌టీపీసీ) సౌత్‌రీజియన్ హెడ్‌క్వార్టర్స్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి ప్రాంగణంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం చేపట్టి పరిసరాలను పరిశుభ్రం చేశారు. ప్రొఫెసర్ వాణి ముఖ్యఅతిథిగా హాజరై పరిసరాల పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ బాధ్యతగా పాటించాలని సూచించారు. అనంతరం గాంధీ ఆస్పత్రికి డస్ట్ బిన్‌లను వితరణగా అందించారు. ఈ కార్యక్రమంలో గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజకుమారి, డిప్యూటీ ప్రొఫెసర్ సునీల్‌కుమార్, ఆర్ఎంఓ-1 శేషాద్రి, ఎన్‌టీపీసీ జనరల్ మేనేజర్లు, ఎస్ఎస్ పాణిగ్రహి, రోహిత్‌చాబ్రా, సురేష్‌వెంకటేష్, గాంధీ వైద్యులు, ఎన్‌టీపీసీ సిబ్బంది పాల్గొన్నారు.

## పురాణా ఇతిహాసాలను పిల్లలకు తెలియజేయాలి

సనతనగర్: పురాణా ఇతిహాసాల గురించి నేటితరం పిల్లలకు తెలియజేయడమే కాకుండా వాటి సారాంశాన్ని వివరించాలని బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ అన్నారు. మోడల్‌కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక సంస్కృతి కమ్యూనిటీ హాల్‌లో రెండు రోజులపాటు జరిగిన 'శ్రీమద్భాగవతం' ప్రవచనం గురువారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురాణాలు, ఇతిహాసాలు, ఉపనిషత్తులు, కావ్యాలు చదవడమే కాదని వాటిల్లోని అంశాలను అనుసరించడమే భారతీయ జీవన విధానమన్నారు. నేటితరం పిల్లలకు వాటిని బోధించాల్సిన అవసరం ఉందన్నారు. కష్టం వచ్చినప్పుడు ఏవిధంగా ఎదుర్కోవాలో అవగతం చేసుకోవాలంటే ధైర్యాన్ని నూరిపోసే గ్రంథ పఠనం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బుచ్చిబాబు, ఉపాధ్యక్షుడు జేఎస్‌టీ శాయి తదితరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి

సికింద్రాబాద్: సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ 9వ ప్లాట్‌ఫామ్‌పై గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం..సుమారు 60 ఏళ్ల వయసున్న వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందినట్టు గుర్తించారు. మృతుడి వివరాలు పోలీసులకు లభించలేదు. మృతుడి వంటిపై నలుపురంగు షర్టు, గళ్లా లుంగీ ఉన్నట్టు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

# ధీరవనిత చాకలి ఐలమ్మ

రసూల్‌పురా: దొరల భూస్వామ్య వ్యవస్థపై తిరుగుబాటు చేసిన ధీరవనిత చాకలి ఐలమ్మ నేటి తరానికి ఉద్యమస్ఫూర్తి అని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. మడ్‌ఫోర్ట్ ధోబీ ఘాట్ వద్ద రజక సంఘం ఆధ్వర్యంలో గురువారం చాకలి ఐలమ్మ జయంతిని కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నేతలు వేర్వేరుగా నిర్వహించారు. ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి ఆమె చేసిన ఉద్యమాలను గుర్తుచేశారు. బీఆర్ఎస్ నాయకురాలు నివేదిత సాయన్న, రాష్ట్ర బెవరేజేస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గజ్జెల నాగేష్, బోర్డు మాజీ సభ్యులు అనిత ప్రభాకర్, పాండు యాదవ్, జక్కుల మహేశ్వర్ రెడ్డి, మార్కెట్ మాజీ చైర్మన్ టీఎన్. శ్రీనివాస్, బీజేపీ నాయకులు బానుక మల్లికార్జున్ బీఎన్. శ్రీనివాస్ తదితరులు చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్



వారాసీగూడలో నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



అడ్డగుట్ట చౌరస్తాలో...

### సీతాఫల్‌మండిలో..

సికింద్రాబాద్: వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు గురువారం సీతాఫల్‌మండి డివిజన్ వారాసీగూడ శివాజీ విగ్రహం వద్ద జరిగాయి. బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కోశాధికారి ఆకారం రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మహంకాళి జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి హాజరయ్యారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా చాకలి ఐలమ్మ చేసిన పోరాటాలను స్మరించుకున్నారు. బీజేపీ నాయకులు కృష్ణమూర్తి, అంబాల రాజేశ్వరరావు, సురేష్ ముదిరాజ్, సురేందర్, కుమార్, ఈఎల్ ప్రతాప్,పాల్గొన్నారు.

### ఓయూలో..

ఉస్మానియా యూనివర్సిటీ: ఆర్ట్స్ కాలేజీ ఎదుట తెలంగాణ విద్యార్థి ఉద్యమకారుల వేదిక (టీవీయూవీ) ఆధ్వర్యంలో ఐలమ్మ జయంతి నిర్వహించారు. టీవీయూవీ రాష్ట్ర అధ్యక్షులు కంచెర్ల బద్రి, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎల్ మూర్తి, రవినాయక్, పీడీఎస్‌యూ నేత సుమంత్, అధ్యాపకులు కొండ నాగేశ్వర్‌రావు, వంశీధర్, సామాజిక వేత్త కోటి పాల్గొన్నారు.

### అడ్డగుట్టలో..

అడ్డగుట్ట: ఐలమ్మ జయంతిని అడ్డగుట్ట చౌరస్తాలో రజక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు ఎం.శివ, శ్రీధర్, సంతోష్, సాయిబాబా, మహేందర్, శ్రీను, రాజు, కిషన్, రుద్రాం స్వామి, దుర్గాప్రసాద్, కోమల, దేవి పాల్గొన్నారు.

**ఐలమ్మ పోరాట పటిమ స్ఫూర్తిదాయకం..**

సనత్‌నగర్: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో వీరవనితగా ఖ్యాతికెక్కిన చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను సనత్‌నగర్‌లోని తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన సభ్య కార్యదర్శి మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం దొరలపై పోరాడిన ధీశాలి చాకలి ఐలమ్మ అని కొనియాడారు. పెత్తందారీ గుండెల్లో గుబులు పుట్టించిన వీరవనితగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో పీసీబీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఆర్ట్స్ కాలేజీ ఎదుట విద్యార్థులు, అధ్యాపకులు



పీసీబీ కార్యాలయంలో...

## అర్హులైన వారికే 'డబుల్' ఇళ్లు కేటాయించాలి

కంటోన్మెంట్: అర్హులైన వారికి మాత్రమే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించాలని ఎమ్మెల్యే శ్రీగణేశ్ రెవెన్యూ అధికారులకు సూచించారు. ఈ మేరకు గురువారం సికింద్రాబాద్ ఆర్‌డీఓ దశరత్ నాయక్‌ను కలిసి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపు సహా ఇతర అంశాలపై చర్చించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపు విషయంలో ఎలాంటి రాజకీయ ఒత్తిడిలకు తావివ్వొద్దన్నారు. కొందరు దళారులు తన పేరిట కూడా పైరవీలు చేసే అవకాశముంటుందని, వారి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కావాల్సిన వారు నేరుగా రెవెన్యూ అధికారులకు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. కంటోన్మెంట్‌లో నిర్మాణం పూర్తయి ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను దసరా లోపు లబ్ధిదారులకు అందజేస్తామన్నారు.



సికింద్రాబాద్ ఆర్‌డీఓను కలిసిన ఎమ్మెల్యే శ్రీగణేశ్

## 'అమ్మ పేరిట మొక్క'

కంటోన్మెంట్ : సికింద్రాబాద్ కంటోన్మెంట్ పర్యటించిన రక్షణ శాఖ ఉన్నతాధికారులు రాకేశ్ మిట్టల్, ప్రేమ్ చంద్, అమోల్ బి. జగతప్‌లు 'స్వచ్ఛత హీ సేవా' కార్యక్రమంలో భాగంగా పికెట్ గార్డెన్స్‌లో మొక్కలు నాటారు.'అమ్మ పేరిట ఓ మొక్క' నినాదంతో కంటోన్మెంట్ బోర్డు ఆధ్వర్యంలో కొన్ని రోజులుగా స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని విజయవంతంగా కొనసాగిస్తున్నారు. ఈ కార్యక్రమం సాగుతున్న తీరును అభినందించిన రక్షణ శాఖ ఉన్నతాధికారులు స్వయంగా మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో బోర్డు సీఈఓ మధుకర్ నాయక్, డీఈఓ దినేశ్ రెడ్డి, జాయింట్ సీఈఓ పల్లవి విజయ్‌వర్నీ పాల్గొన్నారు.

## ఆరోగ్యకర శిశువుల పుట్టుకే లక్ష్యంగా ముందుకు

**హెడ్ డాక్టర్ అమిత ఇందర్‌సేన్**

అమీర్‌పేట: ఆరోగ్యకర శిశువుల పుట్టుకే లక్ష్యంగా వైద్యులు ముందుకు వెళ్లాలని అపోలో క్రెడిల్ చిల్డ్రన్స్ ఆసుపత్రి ఫీటల్ మెడిసిన్ హెడ్ డాక్టర్ అమిత ఇందర్‌సేన్ అన్నారు. ఆసుపత్రి ఆధ్వర్యంలో అమీర్‌పేట మ్యారీగోల్డ్ హోటల్‌లో గురువారం 'ఆప్టిమైజింగ్ ఫీటల్ అవుట్ కమ్స్'పై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిండంకు చేసే చికిత్సలు ఆరోగ్యకరమైన బిడ్డను ప్రసవించటానికి, గర్భధారణ సక్సెస్ రేటును కూడా పెంచటానికి సహాయపడుతుందని తెలిపారు. నవజాత శిశువు జీవన నాణ్యతను మెరుగుపరుస్తుందని చెప్పారు. ఐవీఎఫ్ ద్వారా గర్భం దాల్చే వారి సంఖ్య పెరిగిపోయిందని, అయితే ఇది రెండు, మూడు గర్భాల పెరుగుదలకు దారి తీస్తుందన్నారు. అధిక గర్భాలు అనేక సమస్యలకు మూలమవుతాయని గుర్తు చేశారు. నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో సమస్యలను సకాలంలో గుర్తించి చికిత్స చేయాలని, లేదంటే గర్భం కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల గైనకాలజిస్టులు, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ సర్వీసెస్ వైద్యులు విజయ్ అగర్వాల్ పాల్గొన్నారు.



సదస్సును ప్రారంభించిన వైద్యులు

## రేషన్ కార్డుల ఈ-కేవైసీ ప్రక్రియను ఇంటి వద్దనే చేయాలి

లాలాపేట: రేషన్ కార్డు జారీలో ప్రభుత్వం చేపడుతున్న ఈ కేవైసీ ప్రక్రియను ఇంటి వద్దనే చేపట్టాలని స్వేరోస్ హైదరాబాద్ కార్యదర్శి కుమార్ షాను డిమాండ్ చేశారు. గురువారం ఆయన తార్నాకలో విలేకర్లతో మాట్లాడుతూ..70 ఏళ్లపైబడిన వృద్ధులు, వికలాంగులు, వివిధ కారణాలతో పేషంట్లుగా మారి ఇంటి వద్దనే ఉంటున్న వారు రేషన్ దుకాణాల వద్దకు వచ్చే పరిస్థితి లేదన్నారు. దీంతో పాటుగా తమ ప్రాంతంలో కొందరు బ్రెయిన్ డెడ్ పేషంట్లు ఉన్నారు. వీరందరికీ ఈ కేవైసీ లేక రేషన్ కార్డులు రద్దు అయ్యే ప్రమాదం ఉందన్నారు. వీరి కోసం ఈ కేవైసీ అప్‌డేట్ చేసుకునేలా ప్రత్యేకమైన ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

## 6న 'దాండియా నైట్'

లాలాపేట: బతుకమ్మ, దసరా ఉత్సవాలను పురస్కరించుకుని సీఎస్ఆర్ మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అక్టోబర్ 6న తార్నాకలోని మర్రి కృష్ణాహాల్‌లో దాండియా నైట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఆదివారం సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు బిగ్గెస్ట్ గర్బా డాన్స్ ప్రదర్శన ఉంటుందని నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలియజేశారు. ఆసక్తి గల వారు 6303868045 లో సంప్రదించవచ్చు.

## గాంధీ ఎంబీబీఎస్ విద్యార్థులు 94శాతం ఉత్తీర్ణత

గాంధీ ఆస్పత్రి : సికింద్రాబాద్ గాంధీ మెడికల్ కాలేజీ ఎంబీబీఎస్ మొదటి ఏడాదిలో 94 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఇందిర తెలిపారు. 250 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 235 మంది ఉత్తీర్ణత సాధించారని, వీరిలో 24 మంది డిస్టింక్షన్, 159 ఫస్ట్‌క్లాస్, 52 మంది సెకెండ్ క్లాస్‌లో పాస్ అయ్యారని వివరించారు. పరీక్ష ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ అందిస్తున్నామని, నెలరోజుల్లో జరిగే సప్లిమెంటరీ పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నామని తెలిపారు. శత శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేస్తామని, ఉత్తమమైన విద్యను నేర్పించిన అధ్యాపకులు, ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఇందిర అభినందించారు.

## విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

రసూల్‌పురా: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. కంటోన్మెంట్ జింఖానా మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం కబడ్డీ టోర్నమెంట్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీగణేష్ క్రీడాకారులను పరిచయం చేసుకుని టాస్ వేసి పోటీలను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ..క్రీడలు, క్రీడాకారుల ప్రోత్సాహానికి అనేక చర్యలు తీసుకుంటున్నామని అందులో భాగంగా క్రికెటర్ మహ్మద్ సిరాజ్‌కు, నిఖత్ జరీన్‌కు గ్రూప్-1 ఉద్యోగంతో పాటు ఇంటి స్థలం కూడా సీఎం రేవంత్ రెడ్డి కేటాయించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ డీఈఓ చిరంజీవి, సికింద్రాబాద్ డీఈఓ శ్రీధర్, రమేష్‌గౌడ్, శ్రీదేవి, చంద్రకాంత్ పాల్గొన్నారు.



టాస్ వేసి పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

## టీచర్స్ కాలనీలో స్వచ్ఛతా హీ సేవ

రసూల్‌పురా: కంటోన్మెంట్ బోర్డు శానిటేషన్ విభాగం ఆధ్వర్యంలో గురువారం 7వ వార్డు టీచర్స్ కాలనీలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. క్లీన్ కంటోన్మెంట్ గ్రీన్ కంటోన్మెంట్ నినాదంతో కాలనీవాసులు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ అమిత్‌కుమార్, శానిటేషన్ సూపర్వైజర్ గణేష్, పారిశుద్ధ్య సిబ్బంది చెత్తాచెదారం, పిచ్చిమొక్కలు తొలగించారు. కమ్యూనిటీహాల్ ఆవరణతో పాటు కాలనీ రోడ్లు పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చీపుర్లు పట్టి ఊడ్చారు. అక్టోబర్ 2వ తేదీ వరకు కంటోన్మెంట్‌లోని కాలనీలు, బస్తీల్లో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం కొనసాగిస్తున్నట్లు అమిత్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు భిక్షపతిరెడ్డి, సెక్రటరీ శ్రీనివాస్‌రెడ్డి, ఆనందరావు, హన్మంత్ రెడ్డి, నాగభూషణం కాలనీవాసులు పాల్గొన్నారు.



పరిసరాలు పరిశుభ్రం చేస్తున్న శానిటేషన్ అధికారులు, కాలనీవాసులు

## బహుజన బతుకమ్మను విజయవంతం చేయాలి



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధ్యాపకులు

ఉస్మానియా యూనివర్సిటీ: బహుజన బతుకమ్మను విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ (విజృంభణ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అల్లూరి విజయ్ పేర్కొన్నారు. గురువారం ఓయూలోని ఆంధ్రమహిళా సభ కాలేజీలో ప్రిన్సిపాల్ ఝాన్సీ, అధ్యాపకులు బహుజన బతుకమ్మ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ.. మహిళలపై పెరుగుతున్న అత్యాచారాలను నిరసిస్తూ, స్త్రీలు గౌరవంగా జీవించే హక్కును చాటి చెబుతూ అక్టోబరు 2 నుంచి 10వ తేదీ వరకు జరిగే బహుజన బతుకమ్మను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 27న ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఆట, పాటలతో జరిగే బహుజన బతుకమ్మ కార్యక్రమంలో మహిళలు, విద్యార్థులు భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో విజృంభణ మహిళా నాయకురాలు రమ్యశ్రీ, సీనియర్ అధ్యాపకురాలు రాజ్యలక్ష్మి, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## నిర్మాణ ప్రాజెక్టులకు పీసీబీ అనుమతులు తప్పనిసరి

**పీసీబీ సభ్య కార్యదర్శి రవి వెల్లడి**

సనత్‌నగర్: నిర్మాణ కార్యకలాపాలను ప్రారంభించే ముందు తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీజీపీసీబీ) నుంచి అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని సభ్య కార్యదర్శి రవి సూచించారు. క్రెడాయ్, నారెడ్కో వంటి స్టేక్ హోల్డర్స్‌తో పాటు ప్రభుత్వ విభాగాలైన జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, సీడీఎంఏ, రేరా, డీటీసీపీ ప్రతినిధులతో గురువారం ఆయన సమావేశమై పీసీబీ నిబంధనలపై దిశా నిర్దేశం చేశారు. ఏదైనా నిర్మాణ ప్రాజెక్టులు చేపట్టే ముందు పీసీబీ అనుమతులు తీసుకోవాల్సిందేనని నొక్కి చెప్పారు. ముఖ్యంగా నిర్మాణ కార్యకలాపాల కారణంగా తలెత్తుతున్న కాలుష్య సమస్యలను వారికి వివరించి నియంత్రణకు చర్యలు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా వాయు, జల, ఘన వ్యర్థాలు, సీఅండ్‌డి వ్యర్థాలు, డ్రిల్లింగ్ సమయంలో వెలువడే శబ్ద కాలుష్యం, బ్లాస్టింగ్ కార్యకలాపాలతో తలెత్తే సమస్యల నియంత్రణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయా సంస్థల ప్రతినిధులకు సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారికి తీసుకునే చర్యలతో పాటు జరిమానాల వివరాలను వివరించారు. పర్యావరణ నష్టాన్ని తగ్గించేందుకు సహకరించాలని కోరారు.



టీజీపీసీబీ సభ్య కార్యదర్శి రవితో క్రెడాయ్, నారెడ్కో ప్రతినిధులు

## మోదీ పాలన అద్భుతం

సనత్‌నగర్: ప్రధాని మోదీ పాలన అద్భుతంగా కొనసాగుతుందని, ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారని బీజేపీ డివిజన్ అధ్యక్షుడు కస్తూరి క్రాంతికుమార్ అన్నారు. గురువారం సనత్‌నగర్ డివిజన్ మార్కెట్ లైన్‌లో బూత్‌నెంబర్ 210లో ఆ పార్టీ నేతలు ఇంటింటికీ తిరిగి బీజేపీ సభ్యత్వ నమోదు ప్రక్రియ చేపట్టారు. బీజేపీ సనత్‌నగర్ నియోజకవర్గ ఓబీసీ మోర్చా కన్వీనర్ కస్తూరి చంద్రకుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో క్రాంతికుమార్ హాజరై మాట్లాడుతూ ప్రజలు స్వచ్ఛందంగా ముందుకువచ్చి బీజేపీ సభ్యత్వాలను స్వీకరిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు దయానంద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బన్సీలాల్‌పేట్: దేశంలో అతిపెద్ద సభ్యత్వం, ఎక్కువ పార్టీ శ్రేణులు ఉన్న పార్టీ బీజేపీ అని కార్పొరేటర్ చీర సుచిత్ర అన్నారు. పాన్‌బజార్, జీరా, గాస్‌మండి తదితర ప్రాంతాల్లో గురువారం నాయకులు బీజేపీ సభ్యత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ చీర సుచిత్రశ్రీకాంత్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. వ్యాపార, వాణిజ్య సంస్థల్లో బీజేపీ నాయకులు సభ్యత్వాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ మోర్చా ఉపాధ్యక్షులు చీర సత్యనారాయణ, ఎలియాస్ శ్రీకాంత్, ఆకుల ప్రతాప్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ చీర సుచిత్ర, చీర సత్యనారాయణలు మాట్లాడుతూ దేశాన్ని అన్ని రంగాల్లో ప్రగతి పథంలోకి తీసుకెళ్తున్న ఘనత ప్రధాన మంత్రి నరేంద్రమోదీకే దక్కుతుందన్నారు.



సభ్యత్వ నమోదులో సనత్‌నగర్ డివిజన్ నేతలు

# ఘనంగా సీసీఎంబీ ఓపెన్ డే



ఓపెన్ డేలో పాల్గొన్న విద్యార్థులు

లాలాపేట: సీఎస్ఐఆర్ 83వ ఫౌండేషన్ డేను పురస్కరించుకుని సెంటర్ ఫర్ సెల్యూలర్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ) ఓపెన్ డేను ఘనంగా నిర్వహించారు. సీసీఎంబీలో శాస్త్రవేత్తలు కొనసాగిస్తున్న పరిశోధనాశాలలను విద్యార్థుల కోసం అందుబాటులో ఉంచడంతో పాటు వారు చేస్తున్న పరిశోధనా అంశాలపై ఎగ్జిబిట్స్, పోస్టర్ ప్రదర్శనను ఏర్పాటు చేశారు. దీనికి రెండు తెలుగు రాష్ట్రాలు, మహారాష్ట్ర, జంటనగరాలలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల నుంచి దాదాపు 7000 మంది విద్యార్థులు హాజరయ్యారు.

### సైన్స్ వైపు ఆకర్షించడం ప్రధాన ఉద్దేశం..



పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు సైన్స్ పట్ల ఆసక్తిని పెంపొందించుకుని సైన్స్‌నే కెరియర్‌గా ఉన్నత చదువులు అభ్యసించాలనేదే సీసీఎంబీ ప్రధాన ఉద్దేశం. ఈ సంవత్సరం సీసీఎంబీ డైరెక్టర్ డాక్టర్ వినయ్ నందికూరి మార్గదర్శకత్వంలో ఈ ఓపెన్ డేలో వివిధ పరిశోధనా అంశాలకు సంబంధించి దాదాపు 24 స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు.

–డాక్టర్ ఎంఆర్ విష్ణుప్రియ, చీఫ్‌సైంటిస్టు, సీసీఎంబీ

### ఇన్‌స్పైరింగ్‌గా ఉంది..



సీసీఎంబీ ఓపెన్ డే ద్వారా అక్కడ ఏర్పాటు చేసిన పరిశోధన అంశాలను స్వయంగా చూడటంతో పాటు శాస్త్రవేత్తలతో ముఖాముఖిగా మాట్లాడటం ద్వారా తమకు ఎంతో ఇన్‌స్పైరింగ్ అనిపించింది. రానున్న రోజుల్లో బయాలజీలో ఉన్నత విద్యను అభ్యసించి భవిష్యత్‌లో సైన్స్‌లో సైంటిస్టుగా ఎదగాలని అనిపిస్తుంది.

– నైతిక, సెయింట్ ఆన్స్ గ్రామర్ స్కూల్, మల్కాజిగిరి

### విత్తనాలు ఉచితంగా ఇస్తాం..



తక్కువ గ్లెసైమిక్ ఇండెక్స్ ఉండేలా పర్పుల్ రైస్, ఇంప్రూవ్‌డు సాంబ మసూరి, వంటి పలు వరి వంగడాలను ఇంప్రూవ్ చేశాం. ఇవి ఎండు తెగులు తట్టుకునేలా, భూమిలో పాస్ఫర్స్ తక్కువ ఉన్నప్పటికీ పెరిగే వరి వంగడాలు, తక్కువ నీటిలో తక్కువ కాలంలో పంట వచ్చే వరి వంగడాలను అభివృద్ధి చేశాం. మేము అభివృద్ధి చేసిన వరి వంగడాలను సాగు చేయాలనే ఆసక్తి గల రైతులకు ఉచితంగానే విత్తనాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాం. విత్తనాల కోసం 9935805453లో సంప్రదించవచ్చు.

–డాక్టర్ దీప్తిరావు, యంగ్ సైంటిస్టు

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220378
9912220379